# మా నాన్న మంచోడు!

రాత్రి పదకొండవుతున్నా నిరంజన్‌కు నిద్ర పట్టడం లేదు.

దుప్పటి అందుకుని ముసుగుతన్నాడు.

గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

ఊహుం! రెప్ప పడడం లేదు.

ఇలా లాభం లేదనుకుని లేచి వారపత్రిక తెరిచాడు. కాస్సేపయ్యాక టి.వి. ఆన్ చేసాడు. దేనిమీద దృష్టి నిలకడగా ఉండడం లేదు. మనసంతా అదోలా ఉంది. కూతురి వంక చూసాడు. హాయిగా నిద్రపోతోంది రూప. భార్య నీరజ కూడా అంతే. రూపతో పోటీపడుతూ మరీ గురక పెడుతోంది. వాళ్ళను చూస్తూ ఉంటే నిరంజన్‌కు ఈర్ష్యగా ఉంది. కోపంగా ఉంది. తనకు రాని నిద్ర వాళ్లకెలా పడుతోంది? కారణం చెబితే సిల్లీగా అనిపించవచ్చు. కానీ అది అతడి దృష్టిలో సీరియస్సే.

రోజూ రాత్రి పడుకునే ముందు బుగ్గ మీద ముద్దిచ్చి గుడ్‌నైట్ చెప్పే రూప ఆవేళ ఎందుకో అతనిని పట్టించుకోకుండా పడుకుంది. అది ఆ రోజు అతడిలో చెలరేగే అలజడికి కారణం.

నిరంజన్ దంపతులకు లేకలేక కలిగిన ఏకైక నలుసు రూప. పేరేకాదు. రూపం కూడా అపురూపమే. ముద్దుగా బొద్దుగా ముద్దబంతిలా ఉంటుంది. ఆ పిల్ల అంటే ఆ తండ్రికి ప్రాణం. అపారమైన ప్రేమ.

నిరంజన్ ఒక ప్రయివేట్ ఫర్మ్‌లో పని చేస్తున్నాడు. తీరికలేని ఉద్యోగం అతడిది. ఆఫీసు వేళలు అతడికి వర్తించవు. ఎప్పుడూ బిజీగా ఉంటాడు. అయితే ఎంత రాత్రి అయినా అతగాడి కోసం ఎదురుచూస్తూ కూర్చుంటుంది రూప. తండ్రికి ముద్దు ఇవ్వందే పక్క మీదకు పోదు. రోజూ కంటే తనారోజు త్వరగానే ఇంటికొచ్చాడు.



వచ్చీరాగానే రూప కోసం అతడి కళ్ళు వెతికాయి.

"పాప పడుకుందండి" అన్నది నీరజ.

విస్తుపోయాడు నిరంజన్.

విశ్వంలో గ్రహాలైనా తమ గతిని మార్చు కోవచ్చునేమో గానీ రూప మాత్రం తనకు ముద్దివ్వకుండా పడుకోదు. మరెందుకీ రోజు రొటీన్‌కి భిన్నంగా జరిగింది?

"రూపకు నా మీద కోపం వచ్చిందా?" అడిగాడు కాస్సేపటికి తేరుకుని.

"దానికి మీ మీద ఎందుకండి కోపం? మీరేం చేసారని? ఇవాళ బాగా అలసిపోయినట్లుంది. బడి నుండి వస్తూనే మంచం ఎక్కేసింది. వెళ్లి స్నానం చేసిరండి అన్నం వడ్డిస్తాను" యధాలాపంగా అన్నది నీరజ నవ్వుతూ.

బాత్‌రూమ్‌కెళ్ళాడు నిరంజన్.

డైనింగ్ టేబిలు మీద పదార్థాలు సిద్ధం చేసింది నీరజ.

కంచం ముందు కూర్చున్నాడన్న మాటే గానీ ముద్ద దిగడం లేదు నిరంజన్‌కి. ఎలాగో నాలుగు మెతుకులు కతికి బెడ్ మీదకు చేరాడు. ఆ రోజు తన చిట్టితల్లి ముద్దుకు నోచుకోకపోవడంతో నిద్రకు దూరమయ్యాడు. "రేపటి నుండి ఎన్ని పనులున్నా పెందలాడే ఇంటికొచ్చేయాలి" అనుకుంటూ నడుం వాల్చాడు. ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు. తెలివి వచ్చేసరికి బాగా ప్రొద్దెక్కింది. లేస్తూనే కళ్ళు నులుముకుంటూ రూప కోసం చూశాడు.

అతని అవస్థ నీరజకు అర్థమైనట్లుంది.

"ఇప్పుడే స్కూలుకెళ్ళింది" అన్నది సమాధానంగా.

"రాత్రి ముద్దు ఇవ్వకుండా పడుకుంది. ఇప్పుడేమో టాటా చెప్పకుండా బడికెళ్ళింది. అంటే నా కన్నతల్లికి నిజంగానే నా మీద కోపం వచ్చి ఉండాలి" అనుకున్నాడు నిరంజన్.

ఆ రోజు మనసేమీ బాగులేకపోవడంతో ఆఫీసుకు సెలవు పెట్టేశాడు. రూప వస్తే దాని కోపానికి కారణం ఏమిటో అడిగి తెలుసుకోవాలనుకున్నాడు. ఇహ అక్కడి

నుండి బిడ్డ రాకకోసం క్షణాలు లెక్కపెట్టడం మొదలుపెట్టాడు.

కాలం నత్తనడకగా సాగుతోంది.

పెనిమిటిని ముమ్మాటు భోజనానికి పిలిచింది నీరజ.

అతడిలో చలనం లేదు. కూతురు కోసం కళ్లప్పగించి చూస్తున్నాడు.

భర్త స్థితికి బెంగపడ్డది నీరజ. తనకు కూడా ఆ రోజు ఏమీ తినబుద్ధి కాలేదు. వండిన వంటలు అలాగే పడి ఉన్నాయి.

సాయంత్రం అయింది.

స్కూలు బస్సు వచ్చింది.

ఠపీమని లేచాడు నిరంజన్.

పిల్లలు బిలబిలా బస్సు దిగుతున్నారు.

జారిపోతున్న బ్యాగును పైకెగదోసుకుంటూ లోపల కొచ్చింది రూప.

"పాపా!'' అంటూ ఆరాటంగా కూతుర్ని దగ్గరకు తీసుకోబోయాడు.

ఆ పిల్ల అతడి పట్టు నుండి విడిపించుకుని దూరంగా వెళ్ళిపోయింది.

దెబ్బతిన్నట్లు అయిపోయాడు నిరంజన్.

ఉన్న పళంగా బిడ్డకు తనమీద ఎందుకంత కోపమో తెలీడం లేదు. పిచ్చెక్కినట్లైందతడికి. ఆ ముక్కే అర్ధాంగిని అడిగాడు జుట్టు పీక్కుంటూ.

''నెమ్మదిగా నేను అడిగి తెలుసుకుంటాను మీరేం కంగారుపడొద్దు'' ఓదార్పుగా అన్నది నీరజ.

మరి మాట్లాడలేదు నిరంజన్.

ఆ రాత్రి శివరాత్రే అయిందతనికి.

నీరజ కూతుర్ని గదిలోకి తీసుకెళ్ళి బుజ్జగిస్తూ తండ్రి మీద అలకకు కారణం అడిగింది.

నోరు విప్పక తప్పలేదు రూపకి.

"నిన్న మా టీచరు మద్యం తాగడం వల్ల కలిగే దుష్ఫలితాల గురించి చెప్పారు. నాకు తెలిక అడుగుతాను. మద్యం తీసుకుంటే ఆరోగ్యం పాడవుతుందా? రోజూ తాగేవాళ్ళు గుండె జబ్బు లొచ్చి త్వరగా చచ్చిపోతారని టీచరు చెప్పింది. అది అంత ప్రమాదమా? మరి ఆ సంగతి డాడీకి తెలీదా? తెలిస్తే ఎందుకు తాగుతారు? తాగుడు కారణంగా నాన్న ఏమైనా అయిపోతే మనకు దిక్కెవరమ్మా? మనల్ని ఎవరు చూస్తారు? నాన్న విషం పుచ్చుకుంటూ ఉంటే నేను చూడలేకుండా ఉన్నాను'' అంటూ తల్లి వొడిలో తలదూర్చి ఏడవసాగింది.

ఆ పసిపాప పలుకుల్లో....

నిస్సహాయత గోచరిస్తోంది.

కన్నతండ్రి మీద ప్రేమ ప్రతిఫలిస్తోంది.

భవిష్యత్తు మీద భయం వ్యక్తమౌతోంది.

రూప అడిగే ప్రశ్నలకు ఏం సమాధానమివ్వాలో తెలీక మాటలు రాని ప్రతిమైంది నీరజ. తాగుడు మానండంటూ తను పెనిమిటిని ఎన్నిసార్లు బ్రతిమిలాడిందో లెక్కలేదు. అతడు తన మాటే కాతరు చేయనప్పుడు కూతురి మాట వింటాడా? తండ్రిని తను ఒప్పించలేనని తెలిసే పాపం ఆ పసిపిల్ల తన అసమ్మతిని ఈ విధంగా తెలియజేస్తోందన్నమాట అనుకుంది.

బిడ్డ మాటలు పక్క గదిలో ఉన్న నిరంజన్‌కు లీలగా వినిపించాయి. దాంతో అతడికి కనువిప్పైంది. ఒక్క ఉదుటున లేచి ఫ్రిజ్‌లో ఉన్న బాటిల్స్‌ని, బ్రాందీ సీసాల్ని బయటకు తీసి నేల మీద విసిరికొట్టాడు.

ఆ శబ్దానికి అదిరిపడ్డ నీరజ రూపను తీసుకుని భర్త వద్ద కొచ్చింది.

"నన్ను క్షమించమ్మా నా మీద నీకు ఎందుకంత కోపం వచ్చిందో ఇప్పుడే తెలిసింది. నేను ఇంకెప్పుడూ తాగను. నీ మీద ఒట్టు. తాగుడే కాదు ఇక నుంచి నీకు ఇష్టం లేని పనేదీ నేను చెయ్యను. సరేనా?'' అంటూ కూతురు కోసం చేతులు చాచాడు నిరంజన్.

గబాలున తండ్రిని వాటేసుకుని "మా నాన్న మంచోడు" అంటూ మురిపెంగా అతడికి ముద్దిచ్చింది. రూప.

"మద్యం మానండని నేనెంత అరిచి గీపెట్టినా విన్నారు కాదు. తాగుడు మీద ఉన్న తీపి ప్రపంచంలో మీకు మరి దేనిమీద లేదు. ఉన్నట్లుండి అంత తీపిని ఎలా త్యజించారండి'' అన్నట్లుగా మగడివంక ఆశ్చర్యంగా చూసింది నీరజ.

ఎందకంతగా విస్తుపోతావ్? బ్రాందీ అంటే నాకు ఎనలేని తీపి అన్నమాట వాస్తవం. అందులో ఏమాత్రం సందేహం లేదు. అయితే అది కన్నబిడ్డ తీపి ముందు వెగటుగా అనిపిస్తోంది అంటోంది అతడి అంతరాత్మ.

( ఆంధ్రప్రభ, డైలీ)